క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభ

ఎమ్మిగనూరురూరల్: రైతుల భూ సమస్యల పరిష్కార వేదిక గ్రామసభ అని తహసీల్దార్ శేషఫణి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెసలదిన్నె గ్రామంలో భూ రీ సర్వే గ్రామ సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూమి హద్దులను సరిచేసుకోవాలన్నారు. భూ రీ సర్వే వలన భూమి పరిధి, హద్దులు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. భూ కొలతల సమస్యలుంటే గ్రామ సభలో తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



పైప్‌లైన్‌కు మరమ్మతు చేస్తున్న దృశ్యం

కోసిగి: మండల పరిధిలోని తుంబిగనూరు గ్రామంలో తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు గ్రామ సర్పంచ్ వారం ఈరన్న తెలిపారు. బుధవారం గ్రామంలో పంచాయతీ నిధులు రూ.20వేల లతో తాగునీటి పైప్‌లైన్‌ను రిపేరు చేయించారు. ఆయన మాట్లాడుతూ కొద్ది కాలంగా సాతనూరు ఎస్‌ఎస్‌పీ స్కీమ్ నుంచి గ్రామానికి తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచి పోయిందన్నారు. విషయాన్ని పరిశీలించగా పైప్‌లైన్ మరమ్మతులకు గురైనట్లు గుర్తించి, రిపేరు చేయించామన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

ఎమ్మిగనూరుటౌన్: మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వంట ఏజెన్సీలను మార్చారన్నారు. అయితే కొత్త ఏజెన్సీలు విద్యార్థులకు సక్రమంగా మధ్యాహ్న భోజనం పెట్టడం లేదని ఆరోపించారు.

రైతులను ఆదుకోండి

ఎమ్మిగనూరుటౌన్: రైతులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేసి వారిని ఆదుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి చిన్నిప్రసాద్ కోరారు. ఈ మేరకు బుధవారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధిలేక వలస వెళుతున్న కూలీలను ఆదుకొని ఉపాధి పనులు చేపట్టాలన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్ శాఖలో పనిచేసే మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించి ఎస్కర్ అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు వీరేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీటర్ రీడర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. రీడింగ్ తీసే కార్మికులకు ఒక్కో ఇంటికి ఇచ్చే రూ.3.60పైసల నుంచి రూ.3.72కు పెంచాలన్నారు. సమావేశంలో సంఘ నాయకులు వీరేష్, వీరశేఖర్, రంగస్న, గౌడ్, కిరణ్, భీమ, ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని అలసందగుత్తి గ్రామానికి చెందిన పి.శ్రీనివాసులు తన ఇంటి వద్ద నాటుసారా విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్‌ఐ రామాంజనేయులు బుధవారం తెలిపారు. శ్రీనివాసులు వద్ద నుంచి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

బాలుడి అదృశ్యం



ఈశ్వర్ (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని వాల్మీకి నగర్‌కు చెందిన మల్లికార్జున కుమారుడు ఈశ్వర్(11) బుధవారం ఉదయం నుంచి కనిపించడం లేదని తండ్రి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈశ్వర్ ఉదయం పెద్ద శక్తి గుడి వద్ద ఉన్న ప్రైవేట్ పాఠశాలకు వెళ్లాడు. అయితే ఉదయం 10 గంటల తర్వాత పాఠశాల యాజమాన్యం బాలుడు పాఠశాలకు రాలేదని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వెంటనే తల్లిదండ్రులు బంధువుల ఇళ్ల వద్ద, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. అయినా కనిపించకపోవడంతో సాయంత్రం వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మిలటరీ కాలనీలో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులు సక్రమంగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. డీఈ రాజునాయక్, సెక్రటరి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ ప్రయోజనాలు!

- వన్ నేషన్ – వన్ స్టూడెంట్ పేరుతో ఐడీ కార్డుల జారీకి కేంద్రం శ్రీకారం
- కేజీ నుంచి పీజీ వరకు వివరాలు నిక్షిప్తం
- దేశంలో ఎక్కడైనా చదువుకునే అవకాశం
- కొనసాగుతున్న నమోదు ప్రక్రియ
- డేటా సేకరణలో ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది బిజీ



పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో విద్యార్థినులు

ఎమ్మిగనూరుటౌన్: ఆధార్ తరహాలో విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కేంద్ర మానవ వనరులు, విద్యాశాఖ వన్ నేషన్ వన్ స్టూడెంట్ అన్న పేరుతో 'అపార్' (ఆటోమెటెడ్ పర్మనెంట్ అకాడమి అకౌంట్ రిజిస్ట్రి) నంబర్‌ను కేటాయించనుంది. దీని వల్ల విద్యార్థులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయడంతో ఆ దిశగా చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కేజీ నుంచి పీజీ వరకు సమాచారం

యూడైస్ ప్లస్ వెబ్‌సైట్ వేదికగా జాతీయ స్థాయిలో అపార్ నంబర్ కేటాయించి విద్యార్థికి సంబంధించిన కేజీ నుంచి పీజీ వరకు సమస్త సమాచారం అందులో నిక్షిప్తం చేయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాల పరిధిలోని విద్యార్థులందరికీ ఈ నంబర్‌ను కేటాయించనున్నారు. ప్రస్తుతం యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో ప్రతి విద్యార్థికి 'పెన్' (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్) కేటాయించారు. దీని ఆధారంగానే విద్యార్థులకు టీసీలు జారీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఇకపై అపార్ కార్డు నంబర్ వుంటే ఆ నంబర్‌పై దేశంలో ఎక్కడికైనా వెళ్లి చదువుకొనే అవకాశం వుంది.

ఒక్కసారి నమోదైతే మార్పులకు అవకాశం ఉండదు

విద్యార్థులు అపార్ కార్డు పొందేందుకు విద్యార్థితో పాటు తల్లి లేదా తండ్రి విద్యాసంస్థలకు వెళ్లాల్సిఉంది. మొదట యూడైస్ ప్లస్‌లో నమోదైన వివరాలు సరిచూసుకొని ఆన్‌లైన్ దరఖాస్తు చేయాలి. దీనిని ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లు ధ్రువీకరించాల్సి ఉంటుంది. విద్యార్థి ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేసిన అనంతరం గుర్తింపు నంబర్ జారీ అవుతుంది. ఆన్‌లైన్‌లో అపార్ కార్డు వెలువడుతుంది. ఒకసారి వెలువడిన కార్డులో సవరణలకు అవకాశం వుండదని అధికారులు చెబుతున్నారు. అందువలన అన్ని వివరాలు ముందే సరిచూసుకోవాల్సి వుంటుంది.



అపార్ కార్డు

హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు బిజీ

నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు మండలం, పట్టణంలో 1వ తరగతి నుంచి 10వరకు 23,763 మంది విద్యార్థులు చదువుకొనుచుండగా గోనెగండ్ల మండలంలో 10,900 మంది, నందవరం మండలంలో 9011 మంది విద్యార్థులున్నారు. అపార్ నంబర్‌ల ప్రక్రియలో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు తలమునకలయ్యారు. అయితే చాలా మంది విద్యార్థుల అధార్‌కార్డుల్లో తప్పులుండటంతో పాటు పదో తరగతి సర్టిఫికెట్లతో విద్యార్థుల పేర్లు, వారి తల్లిదండ్రుల పేర్లలో తప్పులు దొర్లడం, ఆధార్‌కు ఫోన్ నంబర్లు అనుసంధానం కాకపోవడం లాంటి సమస్యలతో అపార్ అప్‌లోడ్‌లో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

అనేక ఉపయోగాలు

అపార్ కార్డుతో విద్యార్థులకు అనేక ఉపయోగాలుంటాయని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. అపార్ కార్డులో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, జెండర్, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు కార్డు నంబర్ అన్నీ కలిపి డిజిటల్ రూపంలో భద్రపరచడం జరుగుతుంది. విద్యార్థి చదువుకు సంబంధించిన అకడమిక్ విద్య వివరాలు నమోదవుతాయి. మార్కులు, గ్రేడ్‌లు, ఉపకార వేతనాలు, క్రీడల్లో సాధించిన అంశాలు అందులో నిక్షిప్తమవుతాయి. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల వివరాల నమోదు ధ్రువీకరణ సులభంగా వుంటుంది. విద్యార్థుల వివరాలన్నీ డిజిటల్ లాక్‌లో అనుసంధానం అయి వుండటంతో సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకొనేందుకు సులువుగా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

40 శాతం వరకు వివరాలు సేకరించాం



ఎమ్మిగనూరు పట్టణంతో పాటు మండలంలో ఇప్పటి వరకు 40శాతం విద్యార్థుల వివరాలు నమోదైంది. మిగిలిన విద్యార్థుల వివరాలు కూడా సేకరించేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేస్తున్నారు. అన్ని వివరాలు సేకరించిన తరువాత అపార్ కార్డుల జారీ ప్రక్రియను విద్యాశాఖ ప్రారంభించనుంది. అపార్ కార్డుతో విద్యార్థులకు చాలా ఉపయోగాలున్నాయి.

– మధుసుదన్‌రాజు, ఎంఈఓ 2,ఎమ్మిగనూరు

భ్రూణ హత్యలను సంపూర్ణంగా నివారిద్దాం



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్యా భరద్వాజ్

ఆదోని రూరల్: సమాజంలో భ్రూణ హత్యలను సంపూర్ణంగా నివారించేందుకు కృషి చేయాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పిలుపునిచ్చారు. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ పీసీపీఎన్డీటీ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో భ్రూణ హత్యలు నివారించడం పీసీపీఎన్‌డీటీ చట్టంపై డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పులు తీసుకురావడం ద్వారానే భ్రూణ హత్యలను నివారించగలమన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.50 వేలు జరిమానా నుంచి 3 సంవత్సరాల వరకు జైలుశిక్ష పడుతుందని హెచ్చరించారు. స్కానింగ్ కేంద్రాలపై కచ్చితమైన సమాచారం అందించిన వారికి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు బహుమతి అందించే అవకాశం ఉందన్నారు.

విజేతలకు బహుమతులు

అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అక్టోబర్ 19న కర్నూలులో జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాసం, పెయింటింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సబ్‌కలెక్టర్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. వ్యాసరచన పోటీల్లో ఎస్‌ఎస్ సందేశ్ (హొళగుంద జెడ్పీ పాఠశాల), సౌమ్య(గంజహళ్లి జెడ్పీ పాఠశాల), ఉపన్యాసం పోటీల్లో అనుప్రియ (గంజహళ్లి జెడ్పీ పాఠశాల), పెయింటింగ్ పోటీల్లో మహేంద్ర (తెర్నెకల్ జెడ్పీ పాఠశాల) గెలుపొందారు. సమావేశంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ నాగప్రసాద్, చిన్నపిల్ల డాక్టర్ పరిమళ, డెమో అధికారి శ్రీనివాసులు, డిప్యూటీ డెమో అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా మానిటరింగ్ కన్సల్టెంట్ అధికారి సుమలత, డిప్యూటీ డీఈఓ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

నందవరం : గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ నడిపి షేక్ సాహెబ్ ఆధ్వర్యంలో మండల మీట్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో చేపట్టే అభివృద్ధి పనులను గ్రామ అధికారులు, సర్పంచుల సహకారం తీసుకోవాలన్నారు. సీసీ రోడ్లు, తాగునీరు, పరిశుభ్రత ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను వివరించారు. గ్రామాలలో ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలని ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి కోరారు. అలాగే గ్రామాల్లో సమస్యాత్మక భూములను గుర్తించి, సబ్ డివిజన్ చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులను కోరారు. కార్యక్రమంలో కోఆప్షన్‌మెంబర్ షేక్ అహమ్మద్, సర్పంచులు పావని, వీరస్వామి, ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, ఈఓపీఆర్డీ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి సపర్యలు



వృద్ధుడికి సపర్యలు చేస్తున్న పూలే అంబేద్కర్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: రక్తసంబంధీకులు అందరూ ఉన్నా అనాథగా మారి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మాసిన బట్టలు, పెరిగిన జుట్టుతో పేరుకూడా చెప్పలేని స్థితిలో ఉన్న శివన్న నగర్‌కు చెందిన ఓ వృద్ధుడిని స్థానిక పూలే అంబేద్కర్ సొసైటీ సభ్యులు అక్కున చేర్చుకున్నారు. ఆసుపత్రి వద్ద అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడికి బుధవారం కటింగ్, షేవింగ్ చేసి స్నానం చేయించి నూతన వస్త్రాలు తొడిగి కప్పుకోవడానికి బెడ్‌షీట్ ఇచ్చారు. సొసైటీ సభ్యులు యు.రాము, సింగనేటి నరసన్న, సాతర్ల ప్రసాద్, కనకవీడు, యువరాజు పాల్గొన్నారు.

బైకు దొంగల అరెస్టు



వాహనాలను చూపుతున్న సీఐ, ఎస్‌ఐ

కౌతాళం: ఇద్దరు బైకు దొంగలను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన రహిమాన్ తన ద్విచక్ర వాహనం చోరీకి గురైందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. ఇందులో భాగంగా బదినేహాల్‌కు చెందిన వన్నూర్‌బాషా, మల్లికార్జునలను విచారించగా వారు రహిమాన్ వాహనంతో పాటు పలు చోట్ల వాహనాలను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ నరసింహులు, పాలకవర్గ సభ్యులు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాస అయ్యింది. బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చ, మరోవైపు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మరుగుదొడ్ల అవినీతిపై విచారణ జరపాలని పాలకవర్గ సభ్యులు డిమాండ్ చేస్తూ చైర్మన్ పోడియం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ బిల్లు అజెండా నుంచి తొలగించడంపై కౌన్సిల్ సభ్యులు, వైస్ చైర్మన్ నరసింహులు చైర్ పర్సన్ బోయశాంతను ప్రశ్నించారు. ఈ విషయంపై చైర్‌పర్సన్ , వైస్ చైర్మన్‌ల మధ్య మాటల యుద్ధం జరిగింది. అజెండా అంశం తొలగించేందుకు తమకు అధికారం ఉందని, ఏది పడితే అది అజెండాలో పెట్టమని, అంతా తాము చెప్పినట్లే వినాలని చైర్‌పర్సన్ చెప్పడంతో సభ్యులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఇక సభ్యులు ఎందుకంటూ సమావేశాన్ని మీరే జరుపుకోవాలని 32 మంది కౌన్సిలర్లు బయటకు వచ్చారు.

అంతా చైర్‌పర్సన్ ఇష్టమైతే కౌన్సిలర్లు ఎందుకు?

అంతా చైర్‌పర్సన్ ఇష్టమైతే కౌన్సిలర్లు ఎందుకని వైస్ చైర్మన్ నరసింహులు ప్రశ్నించారు. కౌన్సిల్ సమావేశం నుంచి వాకౌట్ చేసిన అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన బిల్లులు, గత నెల 28న జరిగిన తాత్కాలిక కౌన్సిల్ సమావేశంలో పొందుపరచగా ఆ సమావేశంలో వాయిదా పడిందన్నారు. మళ్లీ అదేనెల 30వ తేదీ నిర్వహించిన సమావేశంలో కాంప్లెక్స్ నిర్మాణం బిల్లు అంశాన్ని అజెండా నుంచి తొలగించారని, ప్రస్తుత సమావేశంలో కూడా కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన బిల్లును అజెండాలో పెట్టకపోవడంతో చైర్ పర్సన్‌ను ప్రశ్నించామన్నారు. అయితే అజెండాలో పెట్టాల్సిన అంతిమ నిర్ణయం చైర్‌పర్సన్‌దేనని కమిషనర్ చెప్పారన్నారు. తుది నిర్ణయం ఆమెదే అంటే ఎలా అని, 32 మంది సభ్యులు మెజార్టీగా ఉన్నాం. తమ నిర్ణయం అక్కర్లేదా అంటూ ప్రశ్నించారు. మున్సిపల్ యాక్ట్ ప్రకారమే నడుచుకోవాలని, ఇలా అడ్డదిడ్డంగా నడుచుకోవడం భావ్యంకాదని, పాలకవర్గ సభ్యులను గౌరవించాలన్నారు. చట్టం గురించి తెలియకపోతే రాజీనామా చేయాలన్నారు.

మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయండి

కౌతాళం: మండలంలో మాడల్‌స్కూల్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు మల్లికార్జునస్వామికి అందజేశారు. సంఘం తాలూకా నాయకులు గురుబసవరాజు, మంజునాథ్, మండల అధ్యక్షుడు సాయివర్మలు మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు ఏపీ మోడల్ స్కూల్ లేకపోవడంతో ప్రైవేట్ స్కూల్స్ వారు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. వెంటనే మోడల్‌స్కూల్, బీసీ, ఎస్సీ హాస్టల్స్‌లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శివశంకర్, నాగరత్న, మహేష్, ఖాదర్ పలువురు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

కౌతాళం: రేషన్‌షాపు డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దారు మల్లికార్జునస్వామి హెచ్చరించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో రేషన్‌షాపు డీలర్లు, ఐఎండీయూ వాహనాల ఆపరేటర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ 1వ తేదీ నుంచి ఉదయం 6గంటలకే సరుకులను పంపిణీ చేయాలన్నారు. దీపావళికి బియ్యంతో పాటు చక్కెర, దాల్ వచ్చిందని వీటిని కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటి తహసీల్దారు రజినీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కోసిగిని కరువు మండలంగా ప్రకటించాలి

కోసిగి: మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో ఒక వైపు భారీ వర్షాలు, మరో వైపు వర్షాభావం కారణంగా సాగుచేసిన పంటల దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయారన్నారు. జిల్లాలోనే అత్యధికంగా కోసిగ మండలం నుంచి బతుకుదెరువు కోసం ఇళ్లకు తాళాలు వేసి పిల్లాపాపలతో వలస వెళ్లారన్నారు. ఎన్నడూ లేని విధంగా వ్యవసాయ భూములు ఉన్న రైతులు కూడా పొలాలను బీడుగా వదిలేసి వలస వెళ్లాల్సి వచ్చిందన్నారు.

14 మందిపై కేసు నమోదు

పెద్దకడబూరు: సాగునీటి పైపులు పగలగొట్టిన 14మందిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని నాగలాపురం, మంత్రాలయం మండలం సింగరాజనహల్లి గ్రామాలకు చెందిన రైతులు మంత్రాలయం మండలం జగ్గాపురం గ్రామానికి చెందిన పద్మావతి పొలంలో నుంచి పైపులు వేసుకున్నారన్నారు. పైపులను తొలగించాలని ఆమె 13 మందిని పంపించగా.. వారు వెళ్లి దాదాపు రూ.లక్షకు పైగా విలువ చేసే పైపులను పగలగొట్టారు. రైతు సింగరాజనహల్లి గ్రామానికి చెందిన పురుషోత్తంరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

కౌతాళం: శ్మశానంలో గుంతలు తీసి జీవనం చేసే కాటికాపర్లను వృత్తిదారులుగా గుర్తించి నాలుగో తరగతి ఉద్యోగులుగా నియమించాలని డిమాండు చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ సుబ్బారాజుకు అందజేశారు. రాష్ట్ర నాయకులు ఎండి ఆనంద్‌బాబు, జిల్లా కార్యదర్శి కృష్ణ, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్న మారయ్య మాట్లాడుతూ వృత్తి పరికరాలను ఉచితంగా ఇవ్వడంతో పాటు ప్రమాదబీమా, ఉచిత ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. రెండు జతల బట్టలు, బూట్లు, సాక్స్ చేతి తొడుగులు ఇవ్వాలని, అలాగే కాటికాపర్లు అందరికి పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో వీరేష్, బసవ, ఈరన్న, నాగరాజు, ఎల్లప్ప, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అవగాహన ఉండాలి

ఆదోని సెంట్రల్: టీబీ(క్షయ) వ్యాధి లక్షణాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ వినోద్ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు అన్నారు. బుధవారం షరాఫ్ బజార్‌లోని మాక్ సెంటర్‌లో సచివాలయం ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ప్రజలకు టీబీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు వారాల కన్నా ఎక్కువగా దగ్గు ఉంటే తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్ల సలహాలను తీసుకుని మందులను వాడాలని తెలిపారు. ఆకలి, బరువు తగ్గడం వంటి సమస్యలను కూడా తేలికగా తీసుకోవద్దన్నారు. కార్యక్రమంలో టీబీ హెల్త్ వర్కర్లు సుబ్బమ్మ బాయి, లలితమ్మ, చంద్రకళ, అరుణ, నీలమ్మ, శిరి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఫిరాయింపులపై కౌన్సిల్‌లో రగడ

ఎమ్మిగనూరుటౌన్: చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం పార్టీ ఫిరాయింపులపై ఇరుపక్షాల వాగ్వాదంతో రాసాభాసగా మారింది. వైఎస్సార్‌సీపీ నుంచి కౌన్సిలర్లుగా గెలుపొంది స్వలాభం కోసం టీడీపీలో చేరారని, అభివృద్ధి కోసం కాదని వైఎస్సార్‌సీపీ 6వ వార్డు కౌన్సిలర్ ఎంకె శివప్రసాద్ పేర్కొనడంతో వాదోపవాదాలు మొదలయ్యాయి. పార్టీ ఫిరాయించిన కౌన్సిలర్లు తమ వార్డుల్లో మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డితో మేజర్ పనులు చేయించుకొని ఇప్పుడు సిగ్గు లేకుండా సొంత అభివృద్ధి కోసం తమ పార్టీ వీడి టీడీపీలో చేరారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పేర్కొనడంతో పార్టీ ఫిరాయించిన కౌన్సిలర్లు అడ్డు తగిలి వాగ్వాదానికి దిగారు. చైర్మన్ ఎంత వారించినా వినకపోవడంతో చివరికి కౌన్సిల్ మీట్‌ను ముగించి ఆయన వెళ్లి పోయారు. కాగా, అజెండాలోని ఒకటి నుంచి 43 అంశాలతో పాటు టెబుల్ అజెండాను కౌన్సిల్ సభ్యులు ఆమోదిస్తున్నట్లు వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ తెలిపారు. సమమావేశంలో మున్సిపల్ డీఈలు విక్టర్, నీరజ, రాజునాయక్, ఏఈలు, ఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.



వాగ్వాదం చేసుకుంటున్న ఇరువర్గాల కౌన్సిలర్లు

కనీస మద్దతు ధర అమలు చేయాలి

ఆదోని రూరల్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌లో పంటలకు కనీస మద్దతు ధర అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు, జిల్లా సహాయ కార్యదర్శి మల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వ్యవసాయ మార్కెట్‌లో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ మార్కెట్‌లో నెల రోజుల నుంచి పత్తి పంట, వేరుశనగ పంట ధరలు పడిపోతున్నాయన్నారు. కనీస మద్దతు ధరలను అమలు చేయాలన్నారు. అనంతరం మార్కెట్‌యార్డు సహాయ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు అయ్యప్ప, ఈరన్న, బాషా, వెంకటేశులు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివిద్దాం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో వైద్యాధికారుల ఆధ్వర్యంలో బుధవారం 'ఆడపిల్లలను రక్షిద్దాం–ఆడపిల్లలను చదివిద్దాం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమన్నారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఆడపిల్లలపై జరుగుతున్న దాడులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ నాగప్రసాద్, చిన్నపిల్లల డాక్టర్ పరిమళ, డెమో అధికారి శ్రీనివాసులు, డిప్యూటీ డెమో అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ హర్షిత తదితరులు పాల్గొన్నారు.